క్లుప్తంగా

బాబాకు ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీర మోహనరావు బాబాకు విశేషంగా పంచామృతాభిషేకం, అన్నాభిషేకం, అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం అమెరికాకు చెందిన పవన్, ధ్రువరాజ్ సహకారంతో అన్నప్రసాద వితరణ జరిగింది. శ్రీసాయినక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన పారాయణం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో తీర్థప్రసాదాలు స్వీకరించారు.

13న పుణ్యతిథి మహోత్సవాలు..

వచ్చేనెల 13వ తేదీ శనివారం షిర్డీ సాయి నాథుని పుణ్యతిథి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీర మోహనరావు తెలిపారు. శనివారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరుగుతాయన్నారు. అదేరోజు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో శాంతి హోమం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గురువారం శాంతి హోమం నిర్వహించారు. కొండపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో ఆలయ అర్చకులు యాగాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ పర్యవేక్షణలో ఆలయ ఈవో రామరావు దంపతులు హోమంలో పాల్గొన్నారు. పూర్ణాహుతి నిర్వహించిన అనంతరం ఈవో రామరావు దంపతులకు వేద ఆశీర్వచనం అందించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పాయకాపురం(విజయవాడరూరల్): స్పందన సేవా సంస్థ, స్పందన వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం 64వ డివిజన్ బీవీ సుబ్బారెడ్డి మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ జరిగింది. 420 మందికి నోటు పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్, నరసింహామూర్తి, భార్గవి, స్కూల్ ప్రధానోపాధ్యాయుడు హనుమంతరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. అలాగే కావలి నుంచి వచ్చిన సంయుక్త సేవా సంస్థ ప్రతినిధి ఆటో డ్రైవర్ సురేంద్ర వరద కారణంగా నష్టపోయిన విద్యార్థులకు 500 నోటు పుస్తకాలను అందజేశారు. గత 12 సంవత్సరాలుగా సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సురేంద్ర తెలిపారు.

యూపీహెచ్‌సీలో సేవలు పునరుద్ధరణ



లబ్బీపేట(విజయవాడతూర్పు): వరద ముంపునకు గురైన అజిత్‌సింగ్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సేవలు పునరుద్ధరించారు. దీంతో అక్కడ అందుతున్న సేవలను గురువారం ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని పరిశీలించారు. ఓపీ రోగులకు చికిత్స, రక్తపరీక్షలు, మందులు అందుబాటు వంటివి తనిఖీ చేశారు. అంతేకాక ఆ కేంద్రం పరిధిలోని నందమూరినగర్‌లో జరుగుతున్న ఫీవర్ సర్వేను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓ డీపీఎం డాక్టర్ నవీన్, యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ యేసోబు, మలేరియా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు నిత్యావసర వస్తువుల పంపిణీ



ఆటోనగర్(విజయవాడతూర్పు): నగరంలో వరదల కారణంగా సర్వం కోల్పోయిన కార్మికులను అన్ని విధాలుగా ఆదుకుంటామని విజయవాడ టైర్ రీట్రేడింగ్ అండ్ వల్కనైజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ రిజ్వాన్ పేర్కొన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలైన రామలింగేశ్వరనగర్, అజిత్ సింగ్‌నగర్, పాయకాపురం, కండ్రిక, రాజరాజేశ్వరిపేటకు చెందిన 200 మంది టైర్ రీట్రేడింగ్ కార్మికులకు ఒక్కొక్కరికీ రూ.2 వేల విలువైన నిత్యావసర సరకులను మహ్మద్ రిజ్వాన్ ఆధ్వర్యంలో గురువారం పంపిణీచేశారు. ఈ సందర్భంగా రిజ్వాన్ మాట్లాడుతూ.. ఇరవై రోజుల క్రితం వరదల కారణంగా కట్టుబట్టలతో కార్మికులు ప్రాణాలతో బయటపడ్డారని, వారిని ఆదుకునేందుకు అసోసియేషన్ ద్వారా నిత్యావసర వస్తువులను అందజేశామని పేర్కొన్నారు. కార్మికులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌కే బాబు, సంధాని, ఖాసీం, బాబా, షఫీ పాల్గొన్నారు.

వరద సాయం డోర్ లాక్డ్!

- జాబితాలో పేరున్నా బాధితుల ఫోన్లకు అందుబాటులో లేరంటూ మెసేజ్‌లు
- మళ్లీ ఎమ్యూమరేషన్ చేయాలని బాధితుల డిమాండ్



ప్రభుత్వ ఆర్థిక సహాయం అందలేదంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్న మహిళలు

పాయకాపురం(విజయవాడరూరల్): వరదల్లో సర్వస్వం కోల్పోయిన కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం రీ ఎన్యూమరేషన్ చేయాలని బాధిత కుటుంబాల మహిళలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. గురువారం వరద బాధితులకు ప్రభుత్వ సహాయం గురించి బ్యాంకుల్లో డబ్బులు జమకాలేదని అడిగేందుకు వెళ్లిన బాధితులకు సచివాలయాల సిబ్బంది నెలాఖరు వరకు చూడాలని చెబుతున్నారు. మరి కొంతమందికి తమ ఫోన్లకు 'అందుబాటులో లేరని', 'డోర్ లాక్డ్' అని మెసేజ్ వస్తుండటంతో వారు తమకు సహాయం అందదనే నిర్ధారణకు వచ్చి.. మళ్లీ రీ ఎన్యూమరేషన్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఈ ప్రాంతాల వారికి..

స్థానిక 64వ డివిజన్ పరిధిలోని కండ్రిక, ఎస్ఎస్‌సీ బోస్‌నగర్, 63వ డివిజన్ ఓల్డ్ రాజీవ్ నగర్, న్యూ రాజీవ్‌నగర్, సుందరయ్య నగర్ ప్రాంతాల్లోని బాధిత కుటుంబాలు వార్డు సచివాలయాలకు వెళ్లి ఆర్థిక సహాయం అందక నిరాశతో వెనక్కి వస్తున్నారు. ప్రభుత్వ ఆర్థిక సహాయం అందజేయకుండా తప్పించుకునేందుకు మొబైల్స్‌కి మెసేజ్‌లు పంపి చేతులు దులుపుకుంటుందని బాధిత మహిళలు ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు.

వరద తగ్గకముందే సర్వే..

ఈనెల 10, 11, 12, 13 తేదీల్లో ముంపునకు గురైన ఇళ్లను ఎన్యూమరేషన్ చేసేందుకు వేరే జిల్లాల నుంచి ఈ ప్రాంతాలకు సిబ్బందిని నియమించింది. అప్పటికి ఇంకా బుడమేరు వరద తగ్గలేదు. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లన్నీ మునిగి ఉండటంతో ఎన్యూమరేషన్ సిబ్బంది ఇళ్ల వద్దకు రాకుండా కూడలి ప్రాంతాల్లో కూర్చొని వారి వద్దకు వచ్చిన బాధిత కుటుంబాల పేర్లు మాత్రమే నమోదు చేసుకొని నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. అధికారుల నుంచి వస్తున్న ఒత్తిళ్లను తట్టుకోలేక డోర్‌లాక్డ్ అని, బాధితులు అందుబాటులో లేరని జాబితాలను రెడీ చేసి ప్రభుత్వానికి పంపించేశారు. వరద తగ్గుముఖం పట్టిన పిమ్మట బాధితులు ఇళ్లల్లో ఉన్న సామాన్లతో పాటు రేషన్‌కార్డులు, ఆధార్‌కార్డులు వరదల్లో కొట్టుకొని పోయినట్లు సచివాలయాల సిబ్బందికి చెప్పి తమ పేర్లు బాధితుల జాబితాల్లో రాసుకునే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది.

పేరున్నా రాలేదు..



ఇంటిలోకి వరద నీరు వచ్చిన ఇల్లు మునిగిపోయింది. సర్వే సిబ్బంది మా ఇంటికి వచ్చి పేరు రాసుకోవడంతో పాటు ఇంట్లో నష్టపోయిన సామగ్రి వివరాలను నమోదు చేసుకున్నారు. బాధితుల లిస్టులో పేరు కూడా ఉంది. కానీ సాయం అందలేదు. ఇప్పుడు ఫోన్‌కి 'సర్వే సిబ్బందికి అందుబాటులో లేరు' మెసేజ్ వచ్చింది. వార్డు సిబ్బందిని అడుగుతుంటే రెండు, మూడు రోజులు ఆగండని చెబుతున్నారు.

– కంకనాళ్ల కనకమ్మ, కండ్రిక

వరద బాధితుల నమోదులో గందరగోళం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు



బాధితులను కలిసి వివరాలు తెలుసుకుంటున్న సీహెచ్ బాబూరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద బాధితుల వివరాలు నమోదులో గందరగోళం నెలకొందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు అన్నారు. ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సహాయం అనేక మందికి అందని పరిస్థితి నెలకొందన్నారు. గురువారం అజిత్‌సింగ్ నగర్, సుందరయ్య నగర్, న్యూ రాజరాజేశ్వరి పేట, వాంబే కాలనీ ప్రాంతాల్లో బాబూరావు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల వద్ద పెద్ద ఎత్తున బాధితులు అధికారులను నిలదీస్తున్నారని, వారి నుంచి సరైన సమాధానం రావడం లేదన్నారు. ప్రజల ఫిర్యాదులను స్వీకరించే నాథుడే కరువయ్యాడన్నారు. చిరువ్యాపారులు భారీగా దెబ్బతిన్నారని, వారి వివరాలు అసలు నమోదు చేయలేదన్నారు. నష్టం నమోదులో వచ్చిన ఇబ్బందులపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియని గందరగోళంలో బాధితులు ఉన్నారన్నారు. జాబితాల్లో లోపాలు సరిదిద్ది, బాధితులందరికీ న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు బి. రమణరావు, శివ, నిర్మల, శ్రీను, పీరు తదితరులు పాల్గొన్నారు.

వార్డు సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

పటమట(విజయవాడతూర్పు): నగర పరిధిలో ఉన్న వార్డ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్పెషల్ ఆఫీసర్లను నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. గురువారం ఉదయం నూతన భవనంలోని సమావేశం హాల్లో స్పెషల్ ఆఫీసర్లు, శాఖధిపతులతో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ.. నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న 64 వార్డులకు 64 మంది స్పెషల్ ఆఫీసర్లను నియమించామన్నారు. స్పెషల్ ఆఫీసర్ తనకు కేటాయించిన ప్రతి సచివాలయంలో సమస్యలను సమీక్షించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా, ఆ వార్డు కార్పొరేటర్‌తో సమన్వయం చేసుకుని సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, దీనిపై తాను నిరంతరం సమీక్షిస్తానని తెలిపారు. ప్రతి వార్డ్ స్పెషల్ ఆఫీసర్, శాఖాధిపతులు, వార్డ్ సెక్రటరీలు, జోనల్ కమిషనర్‌తో ఆ వార్డులో కమిషనర్ సమక్షంలో సమీక్ష సమావేశం నిర్వహించి సంబంధిత వార్డులో ఉన్న సమస్యలన్నీ తెలుసుకొని త్వరితగతిన పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 64 వార్డుల్లో 64 మంది స్పెషలాఫీసర్లతో సమావేశం నిర్వహించే దిశగా ప్రణాళికను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి వార్డులో ఉన్న ప్రతి చిన్న సమస్య అయినా పెద్ద సమస్య అయినా స్పెషల్ ఆఫీసర్ దృష్టిలో ఉండాలని స్పష్టం చేశారు. ఆ సమస్యను సంబంధిత శాఖాధిపతులతో మాట్లాడి త్వరగా పరిష్కరించాలని, అందుకు తన సహకారం అన్నివేళలా ఉంటుందని స్పష్టంచేశారు.

కార్మికవాడ అభ్యున్నతికి కృషిచేస్తా

ఏటీపీ నూతన అధ్యక్షుడు రాజనాల



ఏటీపీ అధ్యక్షుడు రాజనాల వెంకటరమణారావును అభినందిస్తున్న మల్లాది విష్ణు

ఆటోనగర్(విజయవాడతూర్పు): కార్మికవాడ అభివృద్ధితో పాటు కార్మికుల అభ్యున్నతికి నిరంతరం కృషిచేస్తానని ఆటోమొబైల్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు రాజనాల వెంకటరమణారావు అన్నారు. స్థానిక ఏటీపీ హాలులో ఏటీపీ నూతన అధ్యక్షుడు, పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఏటీపీకు వరుసగా నాల్గోసారి అధ్యక్షుడిగా రాజనాల ఎన్నిక కావడం మంచి పరిణామమని పేర్కొన్నారు. ఆటోనగర్ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం నుంచి నిధులను రాబట్టి కార్మికవాడ సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. త్వరలో తాగునీటి సమస్యను పరిష్కరించడంతోపాటు రహదారుల అభివృద్ధి జరగాలన్నారు. అంతకు ముందు ఏటీపీ అధ్యక్షుడు రాజనాల వెంకటరమణారావు, కార్యదర్శి రావి రామచంద్రారావు, కోశాధికారిగా సయ్యద్ షా సాహెబ్ హుస్సేన్ (బాబా), ఉపాధ్యక్షులుగా అర్జా సత్యనారాయణ, మిగిలిన కార్యవర్గంతో ఎన్నికల అధికారి బాయన వెంకట్రావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు, విజయవాడ తూర్పు ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, గద్దె రామమోహన్, ఐలా మాజీ పాలకవర్గ సభ్యులు ఎస్.దుర్గాప్రసాద్, అన్నే శివనాగేశ్వరరావు, కలాం బ్యాటరీ వర్క్స్ అధినేత డాక్టర్ అబ్దుల్ కలాం, శ్రీనివాసరెడ్డి, దోనె శ్రీనివాసరావు, నెల్లి వెంకటేశ్వరరావు, ఎండీ రిజ్వాన్ పాల్గొన్నారు. కార్యవర్గాన్ని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అభినందించారు.

బాల గంధ్వరుడికి స్వరాభిషేకం

విజయవాడ కల్చరల్: సినీ సంగీత దర్శకుడు, నేపథ్య గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా బాలు సప్తస్వర వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై గురువారం గీతాంజలి మ్యూజిక్స్, రాగ లహరి ఆధ్వర్యంలో నిర్వహించిన సినీ సంగీత కార్యక్రమం ఆకట్టుకుంది. వేటూరి పాటల పరిశోధకుడు డాక్టర్ జయంతి చక్రవర్తి ఆధ్వర్యంలో మల్లాది స్వాతి, రూపశ్రీ, డాక్టర్ భాగ్యశ్రీ, పూర్ణిమ, బాలాజీకుమార్, రాంబాబు తదితరులు ఆలపించిన గీతాలు అలరించాయి. జానపద గాయకుడు దామోదర గణపతిరావు పాటలలోని భావాలను వివరించారు. డాక్టర్ జయంతి చక్రవర్తి బాలు సినీ సంగీత సేవలను వివరించారు. కార్యక్రమంలో వివిధ సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు పరచూరి విజయలక్ష్మి, జయంతి మోహన్ శర్మ, ప్రసూనా రామన్ తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నరుపేట చల్లపల్లి బంగ్లా సమీపంలో వేంచేసి యున్న శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో వచ్చే నెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు దసరా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వై. సీతారామయ్య తెలిపారు. గురువారం దసర ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు అమ్మవారికి చండీ హోమం, రుద్రహోమాలు, కుంకుమ పూజలు అత్యంత వైభవోపేతంగా జరుగుతాయన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు అప్పన, సాయిబాబు పాల్గొన్నారు.

28న రాష్ట్రవ్యాప్త నిరసన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎంతో పవిత్రమైన తిరుమల తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారంలో ప్రపంచ వ్యాప్తంగా హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయని మహాదళ్ ప్రతినిధి గణేష్ మహరాజ్ అన్నారు. దీనికి నిరసనగా మహాదళ్, హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 28న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీడీలో ప్రక్షాళన జరగాలన్నారు. లడ్డూ అంశాన్ని రాజకీయంగా తీసుకెళ్లకుండా బాధ్యులైన వారిని శిక్షించాలన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు జరగకుండా సనాతన ధర్మరక్షణ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మహాదళ్ ప్రతినిధులు కొర్రబోలు శ్రీనివాసరావు, రవి, పోతురాజు పాల్గొన్నారు.

ఎట్టకేలకు శుభ్రం చేశారు

సాక్షి ఎఫెక్ట్



పరిశుభ్రంగా మరుగుదొడ్డి పరిసరాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎట్టకేలకు నగరపాలకసంస్థ పారిశుద్ధ్య సిబ్బంది స్పందించారు. దుర్గాపురం శానిటరీ కార్యాలయానికి అతి సమీపంలోని మరుగుదొడ్డిని గురువారం శుభ్రం చేశారు. ఇక్కడ మరుగుదొడ్డిని సక్రమంగా శుభ్రం చేయకపోవటంతో పాటు వాటర్ ట్యాంక్ నుంచి కిందకు నీళ్లు వచ్చే పైపులు లేకపోవటంతో ఎవరికి వారు పనికానిచ్చేసి వెళ్లిపోతున్నారు. దీంతో స్థానికులు పడుతున్న అవస్థలు వివరిస్తూ సాక్షి దినపత్రిక గురువారం 'దుర్గంధం వెదజల్లుతున్న మరుగుదొడ్లు' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన పారిశుద్ధ్య సిబ్బంది మరుగుదొడ్డిని శుభ్రం చేయటంతో పాటు వాటర్ ట్యాంక్ నుంచి నీళ్లు వచ్చేందుకు అవసరమైన పైపులు ఏర్పాటు చేశారు. చుట్టూ శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు.

వరదబాధిత ఫొటోగ్రాఫర్లకు సరుకులు పంపిణీ



ఫొటోగ్రాఫర్లకు బియ్యం, నిత్యావసర సరుకులు అందిస్తున్న వెల్ఫేర్ సభ్యులు



రంగస్థల కళాకారులకు సరుకులు అందిస్తున్న జీవన్ కుమార్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద కారణంగా నష్ట పోయిన ఫొటో/వీడియో గ్రాఫర్‌లకు అజిత్ సింగ్‌నగర్ ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర వస్తువులు, దుప్పట్ల పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు అగస్త్య రవికుమార్ మాట్లాడుతూ బుడమేరు వల్ల చరిత్రలో ఎన్నడూ కనీవినీ ఎరుగని నష్టం జరిగిందని, వరదల కారణంగా వందల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరదల్లో చిక్కుకున్న ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు, ఇతర అనుబంధ వృత్తులు కలిగిన 130 కుటుంబాలకు తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర వస్తువులు, దుప్పట్లు అందించి కాస్త తోడ్పాటు అందిస్తున్నామన్నారు. విజయవాడ ప్రొఫెషనల్ ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పేరం కోటిరెడ్డి, మాదాల రమేష్, విజయ పికిల్స్ అధినేత రాము, అజిత్‌సింగ్ నగర్ ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ సభ్యులు రామకృష్ణ, సుభాని, వాసు, రమేష్, రవికుమార్ పాల్గొన్నారు.

కళాకారులకు నిత్యావసరాలు..

విజయవాడ కల్చరల్: పౌరాణిక రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో వరద కారణంగా నగరంలోని వివిధ ప్రాంతాలలో నివసించే పేద రంగస్థల కళాకారులకు గురువారం గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై నిత్యావసరాలను పంపిణీ చేశారు. అధ్యక్షుడు జీవన్‌కుమార్ మాట్లాడుతూ కళాకారులకు 2 లక్షల రూపాయల విలువైన నిత్యావసరాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే ఇటీవలే అనారోగ్యానికి గురైన కళాకారుడు భూషయ్యకు రూ. 5వేలు అందించామన్నారు. కళాకారులు సువర్ణ, బి. రామ్మోహనరెడ్డి, అగురు త్రినాథనాయుడు, యేసుపాదం, దాసు, ఇట్టా విఠల్, ఎం. ఆంటోని పాల్గొన్నారు.

గాంధీహిల్‌పై స్వచ్ఛతా హీ సేవ



300 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



గాంధీహిల్‌పై పిచ్చిమొక్కలను తొలగిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తదితరులు

పటమట(విజయవాడతూర్పు): నగర పేరు ప్రఖ్యాతులు పెరగాలంటే చారిత్రక ప్రాంతాల్లో స్వచ్ఛత ఎంతో ముఖ్యమని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం ఉదయం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గాంధీహిల్‌పై కమిషనర్, అధికారులు, విద్యార్థులు పిచ్చి మొక్కలు, వ్యర్థాలను శ్రమదానంతో తొలగించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలోనే వీఎంసీ ఆధ్వర్యంలో నగరంలోని చారిత్రక ప్రదేశాలైన గాంధీ హిల్, మొగల్రాజపురం గుహల వద్ద వ్యర్థాలను శ్రమదానం ద్వారా శుభ్రం చేశామన్నారు. ప్రజలు కూడా ఉత్సాహంగా పాల్గొంటున్నారని పేర్కొన్నారు. స్వచ్ఛ విజయవాడ కేవలం ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమన్నారు. అందుకు ప్రజల నుంచి సహకారం అందుతున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం బుర్రకథ ద్వారా స్వచ్ఛతను వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగానే సర్కిల్–3 పరిధిలోని మొగల్రాజపురం గుహలు, పరిసరాలను వీఎంసీ సిబ్బంది శుభ్రం చేశారు.

జాతీయ జెండాతో ర్యాలీ

ఈ సందర్భంగా సర్కిల్–1, 2 పరిధిలోని కళాశాలలు, పాఠశాల విద్యార్థులు 300 అడుగుల పొడవైన జాతీయ జెండాతో గాంధీహిల్ దిగువ నుంచి పైకి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొండపై ప్లాస్టిక్ నిషేధం, పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛభారత్‌పై అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం, పరిసరాల పరిశుభ్రత, రెడ్యూస్డ్ రీ యూజ్ రీసైకిల్, స్వచ్ఛభారత్ నినాదాలతో అక్కడున్న ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఎంసీ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) కె.వి.సత్యవతి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, జోనల్ కమిషనర్లు రమ్య కీర్తన, ప్రభుదాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు, డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ బాబు శ్రీనివాస్, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, సర్కిల్–1 కార్పొరేషన్ సిబ్బంది, గాంధీజీ మునిసిపల్ హై స్కూల్, పాదుర్తి సుందరమ్మ హై స్కూల్, వించిపేట ఉర్దూ హై స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

దసరా సాంస్కృతికోత్సవాలు ప్రారంభం



ప్రసంగిస్తున్న ఉన్నత విద్యాశాఖ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఉమామహేశ్వరిదేవి



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): యువతీ యువకుల్లో సృజనాత్మకతను, సమాజంపై అవగాహన పెంచేందుకు దసరా సాంస్కృతికోత్సవాలు నిర్వహించడం అభినందనీయమని ఏపీ ఉన్నత విద్యాశాఖ వైస్ చైర్మన్ పి.ఉమామహేశ్వరిదేవి అన్నారు. రాఘవయ్య పార్కు సమీపంలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న దసరా సాంస్కృతికోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా ఉమామహేశ్వరిదేవి పాల్గొని ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శాస్త్రీయ, జానపద, వెస్ట్రన్ డాన్సులు, అభ్యుదయ, దేశభక్తి, జానపద పాటల పోటీలలో యువతీ యువకులు పాల్గొని ప్రతిభ కనబరిచారు.



అవాక్కయ్యే ఆకృతులు

ఇంద్రగిరికి కడియం మొక్కల సోయగం

దసరా ఉత్సవాల నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలోని పలు ప్రాంతాల్లో కడియం నుంచి తీసుకొచ్చిన వివిధ ఆకృతుల్లోని మొక్కలను ఏర్పాటు చేయాలని దేవస్థానం నిర్ణయించింది. ఇప్పటికే కొన్ని మొక్కలను ఇంద్రకీలాద్రికి తరలించగా, మరి కొన్ని మొక్కలు ఒకటి రెండు రోజులలో ఆలయానికి చేరనున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ఓంకారం, శివలింగాకృతి, జంట నెమళ్లు, జిరాఫీలు, ఈఫిల్ టవర్, తలపై కడవతో వస్తున్న మహిళాకృతిలో ఈ మొక్కలను తీర్చిదిద్దారు. అమ్మవారి ఆలయ పరిసరాలతో పాటు మల్లేశ్వర స్వామి వారి ఆలయం వద్ద ఈ మొక్కలను ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ మొక్కల సంరక్షణకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

– ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ)